క్లుప్తంగా

గజలమ్మ విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవం



ఊట్కూర్: మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో గజలమ్మ విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 3 రోజుల పాటు వేదపండితులచే హోమం, ధాన్యనివాసం, జలనివాసం, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. సాయంత్రం బోనాలతో గ్రామంలో శోభయాత్ర చేపట్టి అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ శెట్టి, విగ్రహాదాత గోకరి అర్జున్‌గౌడ్, అంబన్న, రామకృష్ణ, సంజప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయండి

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటయ్య ఓ ప్రకటనలో కోరారు. గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ పోటీల్లో భాగంగా 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష

కృష్ణా: మండల కేంద్రానికి చెందిన అజయ్‌సింహపై ఫిబ్రవరి 1న డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కృష్ణా ఎస్‌ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో శుక్రవారం నారాయణపేట్ జిల్లా జడ్జి అజయ్‌సింహకు రూ.2వేల జరిమానతో పాటు 5 రోజుల జైలు శిక్షను విధించారని ఎస్‌ఐ విజయభాస్కర్, కోర్టు కానిస్టేబుల్ సంపత్‌రెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

ఆకట్టుకున్న బ్రహ్మంగారి నాటిక ప్రదర్శన

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో శుక్రవారం ప్రదర్శించిన పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటిక గ్రామస్తులను ఆకట్టుకుంది. వివిధ పాత్రలతో చక్కగా మాటల, పాటల రూపంలో వివరించారు. గ్రామస్తులు ఆసక్తిగా నాటికను తిలకించి భక్తి పారవశ్యంలో మునిగారు. బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని గుర్తు చేసుకున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

మరికల్: కరాటేతో ఆత్మరక్షణ పెంపొందుతుందని యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో యువక మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణకు రోజురోజు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతు చేపట్టాలి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్కు దగ్గరలోని సింగార్‌బేస్‌లో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. లీకేజీ కారణంగా వర్షపు నీరు చేరి తాగునీరు కలుషితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయా కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా గోపాల్‌నాయక్



దామరగిద్ద: ఇన్‌చార్జ్ ఎంఈఓగా గోపాల్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మద్దూర్ మండల ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది నాగేందర్, సీఆర్‌పీ మహిపాల్, పీఆర్‌టీయూ నాయకులు నాగేందర్, రమేష్, అంజప్ప, వెంకట్రాములు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సేవలు వెలకట్టలేనివి



నర్వలో

మక్తల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మక్తల్ పట్టణంలో రిటైర్డ్ ఏఎన్‌ఎం రాములమ్మను రాష్ట్ర ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల అసోషియేషన్ సంఘం అధ్యక్షుడు బాబుమియా శుక్రవారం ఆమె నివాసంలో శాలువాతో సన్మానం చేశారు. మక్తల్ పరిసర ప్రాంతాల్లో వైద్యరంగంలో అత్యవసర సమయాల్లో అనేక సేవలు అందించిన నర్సుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆమె ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫయాజ్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నర్వ: ప్రజలకు వైద్య సేవల్లో నర్సుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర ప్రైవేటు నర్సింగ్‌హోమ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బాబు మియా అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్వ పీహెచ్‌సీలోని నర్సులు, వైద్యులను ఆయన శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మక్తల్‌లోని ఆస్పత్రిలో వైద్య సిబ్బందిని, రిటైర్డ్ నర్సు రాములమ్మను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మహ్మద్‌ఫయాజ్, కిష్టప్ప, ఓబ్లేష్, శ్రీనివాసులు, నర్వ వైద్య సిబ్బంది డా.కేశవ్, డా వెంకటేష్, శ్రీలత, వెంకటనర్సమ్మ, ఎల్‌టీ శిరీష తదితరులున్నారు.



ఊట్కూర్ ఆస్పత్రిలో నర్సులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



మక్తల్‌లో..

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఊట్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ, లయన్స్ క్లబ్ సభ్యులు వసంత్‌కుమార్, వంశీచందర్‌రెడ్డి, జయప్రకాశ్, భరత్, రమేశ్‌బాబు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



ఊట్కూర్‌లో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఊట్కూర్: మండల కేంద్రంలో శుక్రవారం బీటీ రోడ్డు పనులను ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషితో స్థానిక బస్టాండ్ నుంచి గాంధీనగర్ వరకు కి.మీ. బీటీ రోడ్డు మంజూరయ్యిందన్నారు. కాంట్రాక్టర్ నాణ్యతతో పనులను చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, నాయకులు అరవింద్ కుమార్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఇబాదుర్ రహిమాన్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

ఊట్కూర్: ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన మహేశ్‌ను శుక్రవారం మాదాసి కురువ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పదో తరగతి పరీక్షల్లో 9.2 గ్రేడ్ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు తల్లిదండ్రులు కుర్వ చంద్రమ్మ, మల్లప్పను శాలువా, పూలమాలలతో సన్మానించారు. భవిష్యత్తులో విద్యార్థి ఉన్నత చదువుల కోసం తమ సంఘం తరఫున అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాదాసి కుర్వ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆశప్ప, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ రద్దు చేసే వరకు పోరాటం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మరికల్: ఇథనాల్ కంపెనీ రద్దు చేసే వరకు పోరాడుతామని కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు వెంకట్రాములు, లక్ష్మయ్యలు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈ నెల 15న మక్తల్‌లో నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మురళి, పటేల్, శ్రీనివాస్, మధు, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ

మరికల్: మండల కేంద్రంలో ఎనిమిది నెలల కిందట జరిగిన వివాహ వేడుకకు నిజామాబాద్‌కు చెందిన వ్యక్తి హాజరై ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడు విగ్నేష్ సీఈఐఆర్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ట్రేస్ చేసి ఫోన్‌ను గుర్తించామని ఎస్‌ఐ హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నాడు. శుక్రవారం బాధితుడి ఎస్‌ఐ ఫోన్ అందజేయడంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

నారాయణపేట టౌన్: మండలంలోని కోటకొండ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకుంది. శుక్రవారం అభంగపూర్ గ్రామస్తులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి బి. రాము మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న కోటకొండ గ్రామాన్ని నూతనంగా మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. అప్పట్లో ఉమ్మడి జిల్లా అధికారులకు కోటకొండ మండలం ఏర్పాటు కోరుతూ ప్రతిపాదనలు పంపించామని గుర్తు చేశారు. నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్ మండలాలు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కాంక్షిస్తూ, మండల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు కాశీనాథ్, ప్రతాప్, యాదగిరి, రాజు, దస్తప్ప, ప్రవీణ్ నర్సిములు, సలీం, రాఘవేంద్ర, సాయిలుపాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

వేతనాలు పెంచాలని వినతి

నారాయణపేట: వేతనాలు పెంచాలని కోరుతూ కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుక్రవారం జిల్లాలోని ధరణి ఆపరేటర్‌లు వినతిపత్రాన్ని అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నామని విన్నవించారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామని వివరించారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

వరి గడ్డిలో పోషకాలు అనేకం



వరి గడ్డి తీసుకువెళ్తున్న రైతులు

- పంట వ్యర్థాలను కాల్చొద్దు
- పశుగ్రాసంగా వాడుకుంటే మంచి ఫలితం

మాగనూర్: యాసంగిలో వేసుకున్న వరిపంట కోతలు పూర్తి కావొచ్చాయి. వరి కోతల అనంతరం గడ్డిని పాడి పశువుల పోషణకు పశుగ్రాసంగా ఏడాది వరకు నిల్వ చేసుకునే వీలుంది. పాడిపశువులకు సాధారణంగా వరిగడ్డిని పశుగ్రాసంగా అందించడం మనకు తెలిసిందే. కొంత మంది రైతులు ఇటీవల కాలంలో యంత్రాల ద్వారా కోతలు చేసి గడ్డిని పొలాల్లోనే వదిలేస్తున్నారు. అనంతరం పంట వేసే సమయంలో పొలంలో కాల్చుతున్నారు. దీంతో భూమికి మేలు చేసే కొన్ని కీటకాలు చనిపోతున్నాయి. భూసారం కూడా తగ్గుతుందని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ వరిగడ్డిలోంచి 40 నుంచి 50 శాతం శక్తిగా మార్పబడి పశువు జీవక్రియలకు ఉపయోగపడుతుంది. వరిగడ్డి నిల్వ, వాటిలో లభించే ప్రొటీన్ల అవశ్యకతను మాగనూర్ పశు వైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ వివరిస్తున్నారు.

తయారీ విధానం

■ పశుగ్రాసాలకు ఎంచుకున్న వరిగడ్డిలో పోషకాల స్థాయిని పెంచేందుకు యూరియా మంచి ఫలితాలిస్తుంది. 100 కిలోల వరిగడ్డికి 4 కిలోల యూరియా నీటితో తడిపి ఇరవై రోజుల మాగాక వాడుకోవచ్చు.

■ ముందుగా తయారీకి ఎంచుకున్న ప్రదేశాన్ని బాగా శుభ్రం చేసి పాలిథిన్ సంచులను కానీ పట్టా కానీ పరచాలి. 60 లీటర్ల నీటిలో 4 కిలోల యూరియా కలిపి, కర్రతో పూర్తిగా కరిగేలా కలపాలి. శుభ్రం పరిచిన వరిగడ్డిలో 1/4 వంతు గడ్డిని పాలిథీన్ సంచిపై పరిచి, తయారు చేసిన యూరియా నీళ్లను పూర్తిగా తడిచేలా చల్లాలి. మరల ఒక పొర వరిగడ్డి పరిచి, మళ్లీ యూరియా నీళ్లు చల్లాలి.

■ పొరల వారీగా వరిగడ్డి పరుస్తూ యూరియా నీటితో గడ్డి తడిచేలా చల్లుతూ సమారు 20 రోజులు గాలి తగలకుండా, మాగబెట్టాలి. అనంతరం ఈ మాగుడుగడ్డిని, మామూలు పశుగ్రాసాలతో కలిపి పాడి పశువులకు మేపడానికి అలవాటు చేయాలి.

■ బూజుపట్టిన లేదా తెగుళు సోకిన వరిగడ్డిని ఉపయోగించరాదు. మాగిన గడ్డికి 15 నిమిషలు గాలి తగిలనిచ్చిన తర్వాతే మేపాలి.

■ యూరియాతో మాగిన గడ్డిలో 6 శాతం మాంసకృత్తులు ఉండి, పశువు శరీర బరువు పెరుగుదల 2.2 శాతం ఉంటుంది. మాగిన గడ్డి తీయగా, రుచికరంగా ఉంటుంది. కాబట్టి పశువులు ఇష్టంగా తింటాయి. ఎక్కువ భాగం జీర్ణం కాగలదు కాబట్టి పశువుల్లో జీవక్రియ సాఫీగా ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



రైతులు, పశు కాపారులు పైన సూచించబడిన సలహాలు, సూచనలు పాటించాలి. దీనివలన వారికి ఇబ్బందులు ఉండవు. పశువులు కూడా ఆరోగ్య కారంగా ఉంటాయి.

– వినయ్‌కుమార్, మండల పశువైద్యశాఖ జూనియర్ అసిస్టెంట్

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

మద్దూరు: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం వీఆర్‌ఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన ఉద్యోగ భద్రత హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న వారికి పదోన్నతులు, వృద్ధులైన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు, పేస్కేల్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చింతరవి అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు మొగులప్ప, కన్నప్ప, రాము, అంజి, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

కొనసాగుతున్న వీఓఏల దీక్షలు



దీక్షలో పాల్గొన్న వీఓఏలు

మక్తల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలకు ప్రతి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రమోషన్, ఐడీ కార్డులను ఇవ్వాలని కోరారు. పనికి తగిన వేతనం లేదని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు ప్రస్తుతం జీతం ఏమాత్రం సరిపోవట్లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్ రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాగనూర్: ప్రజలు మత్తు పదార్థాలు, సైబర్ నేరాగళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మాగనూర్ ఏఎస్‌ఐ మన్నాన్ అన్నారు. శుక్రవారం ఆయన డయల్100 సిబ్బందితో కలిసి మండలంలోని అడవిసత్యారంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం వంటి వాటికి యువత ఆకర్శితులై బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, చాలా మంది డబ్బు లేక దొంగతనాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో యువత సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురవుతున్నారని, వాట్సప్, ఫేసుబుక్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, తక్కువ ధరకే ఆన్‌లైన్లలో వస్తువులు దొరుకుతున్నాయని చాలా మంది తెలియకుండానే డబ్బులు పోగుటుకుంటున్నారని వివరించారు. ఆన్‌లైన్ యాప్స్‌లో రుణాలు తీసుకొని, వాళ్లు పెట్టే ఇబ్బందులకు చాలా మంది ఆత్మహత్య చేసుకుని చనిపోయారని తెలిపారు. సైబర్ నేరాలు వల్ల ఎవరైనా మోసపోతే వెంటనే 1930, 100 డయల్‌కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ మన్నాన్

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దామరగిద్ద: మండల కేంద్రంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సంజీవరాయ ఆలయ సమీపంలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు యాగశాల ప్రయోగం, గోమాత పూజ, గణపతి పూజ, ధజారోహణం, పాత నాభిశిల తొలగింపు, అఖండదీపారాధన, సాయంత్రం విగ్రహ ఊరేగింపు, మంటప ఆరాధన, జలాధివాసము నిర్వహించారు. శనివారం ప్రతిష్ఠ హోమాలు, ఆదివారం ప్రతిష్ఠాపన పూజలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశమ్మ అంజయ్య, దాత బొంబాయి వెంకటప్ప, ఎంపీపీ నర్సప్ప, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, శరణప్ప, భీమయ్యగౌడ్, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో రైతు శ్రీనివాస్‌కు సంబంధించిన గేదె గ్రామ శివారులో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యాదాఘాతానికి గురై శుక్రవారం అక్కడిక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధితుడికి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐ



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఐ.

నారాయణపేట: జిల్లాలోని మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు తీసుకున్న ఎస్‌ఐ పి.శీనయ్య శుక్రవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షణకు పాటుపడాలని ఎస్‌ఐకి ఎస్పీ సూచించారు.

వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అమరచింత: ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం వీఆర్‌ఏలు సమ్మె నిర్వహించారు. రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఒక్కరోజు సమ్మె కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈమేరకు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మహిమూద్, మునిస్వామి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలకు ప్రమోషన్ కల్పించడంతో పాటు పే స్కేల్ అమలు పర్చాలని కోరారు. చనిపోయిన వీఆర్‌ఏల కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, రాజశేఖర్, అర్జున్, గాయత్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేద్దాం



అధికారులతో ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన నిర్వహించిన క్రీడల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడలకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండల స్థాయిలో 15న ప్రారంభం కానున్న క్రీడలకు, 14వ తేదీలోపు గ్రామాల క్రీడాకారులు తమ పేర్లను కార్యదర్శుల ద్వారా నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బద్రు నాయక్ సూచించారు. ఈ క్రీడలు 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మండల కేంద్రంలో ఉంటాయని తెలిపారు.

హన్వాడ: మండల స్థాయి క్రీడల నిర్వహణపై అధికారులతో శుక్రవారం ఎంపీపీ బాల్‌రాజ్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆసక్తి గలవారు పంచాయతీలకు, పీఈటీలకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

గండీడ్: సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే వారు వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

వీఓఏల పోస్ట్ కార్డు ఉద్యమం

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్, గ్రామీణశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తమ సమస్యలను పరిష్కరించాలని వీఓఏలు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. శుక్రవారం 26వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక పోస్టాఫీస్‌లో ఉత్తరాలను పోస్ట్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, పల్లవి, ధనుంజయ్‌గౌడ్, మాధవి, శ్రీలత, అనురాధ, జయమ్మ, ఉమాదేవి, తిరుపతమ్మ, రమేష్, రఘు, ఇంద్రావతి, పద్మ, కురుమూర్తి ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆత్మకూర్: చిట్టెం రామన్న యువసేన ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జాతరమైదానంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 62 జట్లు పోటీల్లో తలపడుతున్నాయని, మొదటి బహుమతి సాధించే జట్టుకు రూ.50వేలు నగదు, షీల్డు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25వేలు నగదు, షీల్డు, ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామన్నారు.